E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :274 శనివారం 12 సెప్టెంబర్ 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

# పేదల ఇళ్లపై మళ్లీ డ్రామా ఎందుకు?

**మూడో విడత ఇందిరమ్మ లబ్ధిదారుల ఇళ్లను వారికే ఇవ్వాలి**

**గతంలో డ్రా తీసి కేటాయించిన ఇళ్లపై మళ్లీ పంచాయతీ ఎందుకు?**

**ప్రభుత్వం స్పందించకుంటే రాష్ట్రవ్యాప్త ఉద్యమం**

**సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ**



2 లో

**జనగామ, సెప్టెంబర్ 11 (తెలుగు గళం)**

జనగామ పట్టణంలో పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జగ్గుల జాన్ వెస్లీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి 72 మంది పేదలకు కేటాయించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను తిరిగి వారికే అప్పగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే అధికారికంగా కేటాయింపులు పూర్తయిన తర్వాత మళ్లీ డ్రా నిర్వహిస్తామనడం పేదలను ఇబ్బందులకు గురిచేయడమేనని మండిపడ్డారు.జనగామ పట్టణంలో 2012--13లో ఇళ్లు లేని 1,144 మంది పేదలను గుర్తించి అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు ఇచ్చిందని జాన్ వెస్లీ తెలిపారు. అయితే స్థలాలు ఇచ్చినప్పటికీ గృహ రుణాలు, విద్యుత్, తాగునీరు, ఇతర మౌలిక వసతులు కల్పించకపోవడంతో పేదలు ఇళ్లు నిర్మించుకోలేకపోయారని చెప్పారు. కొందరు లబ్ధిదారులు అప్పులు చేసి, తమ శక్తిమేరకు రూ.2--3 లక్షలు ఖర్చు చేసి ఇళ్లు నిర్మించుకున్నారని తెలిపారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పేదల స్థలాలను తీసుకుని డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించేందుకు ప్రయత్నించగా లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించారని ఆయన గుర్తుచేశారు. పేదలు నిర్మించుకున్న ఇళ్లు, స్థలాలను బలవంతంగా స్వాధీనం చేసుకోవద్దని, చట్ట ప్రకారం వ్యవహరించాలని కోర్టు ఆదేశాలు ఇచ్చిందన్నారు.2019లో అప్పటి కలెక్టర్, ఆర్డీఓ, తహసీల్దార్ పేదలతో మాట్లాడి ఇళ్లు లేని వారికి స్థలాలు కేటాయించేలా లేఅవుట్ రూపొందించారని తెలిపారు. ఆర్థిక స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేని 72 మంది పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని నిర్ణయించి, 2023 జూలైలో అప్పటి తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్‌లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్రా నిర్వహించి ఇళ్లను కేటాయించారని చెప్పారు.

**అధికారుల నిర్ణయాలకు విలువ లేదా?**

గతంలో అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి ఇళ్లు కేటాయించిన తర్వాత ఇప్పుడు మళ్లీ డ్రా నిర్వహిస్తామని చెప్పడం పేదలకు తీవ్ర అన్యాయం చేయడమేనని జాన్ వెస్లీ అన్నారు





# వికలాంగుల హక్కులపై కేంద్రం కుట్రలు చేస్తోంది

**ఆహార భద్రత హక్కును తొలగించే అధికారం కేంద్రానికి ఎక్కడిది?**

**ఆర్‌పీడీ చట్టం సెక్షన్ 74ను సవరించాలి..ఉద్యోగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి**

**నవంబర్, డిసెంబర్‌లో దేశవ్యాప్త ఉద్యమం చేపడతాం: ఎన్‌పీఆర్‌డీ**

**తెలుగు గళం న్యూస్ న్యూఢిల్లీ, సెప్టెంబర్ 11**



2 లో

వికలాంగులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం క్రమంగా నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తోందని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆరోపించింది. జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ)లో ప్రతిపాదిత సవరణలు వికలాంగుల ఆహార భద్రత హక్కును దెబ్బతీసేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డులు అందే వరకు పోరాటం కొనసాగిస్తామని ప్రకటించింది.న్యూఢిల్లీలోని హరికిషన్ సింగ్ సూర్జీత్ భవన్‌లో సెప్టెంబర్ 11న ఎన్‌పీఆర్‌డీ జాతీయ కార్యవర్గ సమావేశం జాతీయ అధ్యక్షుడు గిరీష్ కీర్తి అధ్యక్షతన జరిగింది. దేశవ్యాప్తంగా వికలాంగులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర ప్రభుత్వ విధానాలపై సమావేశంలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించారు.ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురలీధరన్ మాట్లాడుతూ..పోరాటాల ఫలితంగా దేశవ్యాప్తంగా కోట్లాది మంది వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన రేషన్ కార్డులు మంజూరయ్యాయని తెలిపారు.

# ఏజెన్సీలో గుడుంబా జోరు.. ఎక్సైజ్ శాఖ నిద్రపోతోందా?

**బహిరంగంగానే గుడుంబా విక్రయాలు..అధికారుల నిఘా ఎక్కడ?**

**తయారీ, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజల డిమాండ్**

**గుడుంబా దందాపై ఉన్నతస్థాయి విచారణకు డిమాండ్**








2 లో

# దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు!




2 లో

- పుతిన్, పెజెష్కియాన్‌లతో ప్రధాని భేటీలు
- జిన్‌పింగ్ రాకపై సర్వత్రా ఉత్కంఠ
- ఏడేళ్ల తర్వాత భారత్‌లో అడుగుపెడుతున్న చైనా అధ్యక్షుడు
- మోదీ-జిన్‌పింగ్ భేటీపై ప్రపంచం చూపు
- రక్షణ, దౌత్య సంబంధాలపై పుతిన్‌తో చర్చలు
- ఐరాస సెక్రటరీ జనరల్‌తోనూ కీలక సమావేశం
- వాణిజ్యం, టెక్నాలజీపై బ్రిక్స్ దేశాల దృష్టి

# సీఎం బ్రదర్స్ భూదందా?

- భూములపై కేటీఆర్ తీవ్ర ఆరోపణలు
- కోటి ఎకరాలు 22ఏ జాబితాలోనా?
- రైతులను ఇబ్బంది పెడుతున్నారంటూ ఫైర్
- సీఎం బ్రదర్స్‌పై భూదోపిడీ ఆరోపణలు
- సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శ
- ఫ్యూచర్ సిటీ భూములపై ప్రశ్నలు
- కాంగ్రెస్ పాలనపై కేటీఆర్ మండిపాటు
- రెండేళ్లలో కేసీఆర్ సీఎం అవుతారన్న ధీమా



2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ రాష్ట్రంలో ఉన్న భూములను సీఎం రేవంత్ రెడ్డి హారతి కర్పూలంలో కాజేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. 22ఏ నిషేధిత భూములపై తెలంగాణ భవన్‌లో ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. శాసనసభలో ప్రజ సమస్యలపై మాట్లాడనివ్వకుండా తమ పార్టీ ఎమ్మెల్యేలను మెడ పట్టి గెంటేశారని ఫైర్ అయ్యారు. సీఎం బాగోతాలు బయటపడతాయనే భయంతోనే తమను శాసనసభ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలో ల్యాండ్ చోరీ విపరీతంగా జరుగుతోందని, ఇందిరమ్మ రాజ్యంలో భూములను దోచుకుంటున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు.

**నిషేధిత జాబితాలో కోటి ఎకరాలు..**

బీఆర్ఎస్ హయాంలో 22ఏ కింద కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా.. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత దానిని కోటి 16 లక్షల ఎకరాలకు పెంచారని కేటీఆర్ ఆరోపించారు.

# కులగణనలో తెలంగాణ రోల్ మోడల్!

- 2027 జనగణనలో బీసీ లెక్కలు చేర్చాలి
- బీసీల జనాభాపై మా దగ్గర పక్కా గణాంకాలు
- 42 శాతం రిజర్వేషన్లకు తెలంగాణ అడుగులు
- 50 శాతం పరిమితి దాటేందుకు శాస్త్రీయ ఆధారాలు
- జనాభా ప్రాతిపదికన బీసీలకు న్యాయం చేయాలి
- కేంద్రం కూడా తెలంగాణ బాటలో నడవాలి
- బీసీ కులాల లెక్క తేల్చాలన్న పొన్నం

2 లో

# ఐటీ జాబ్స్‌కు తెలంగాణ బిగ్ బూస్ట్!

- కొత్త జీసీసీ పాలసీకి కసరత్తు
- 75కు పైగా జీసీసీల ఏర్పాటు
- లక్ష మంది యువతకు ఉద్యోగాలు
- టైర్-2 నగరాలకు ఐటీ విస్తరణ
- మూతపడిన ఐటీ హబ్‌లకు పునర్జీవం
- త్వరలో ఆదిలాబాద్ ఐటీ హబ్
- డేటా సెంటర్లపై ప్రత్యేక దృష్టి



2 లో

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన ఐటీ హబ్స్, టవర్లపై అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయించామని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. యాంకర్ పార్టనర్స్ లేదా ఇండస్ట్రీ పార్టనర్స్ భాగస్వామ్యం లేకుండానే గతంలో వీటిని నిర్మించడం వల్ల చాలా చోట్ల ఇవి నిరుపయోగంగా మారాయని తెలిపారు. నిజామాబాద్ ఐటీ టవర్, ఐటీ హబ్‌పై శాసనసభ్యుడు అడిగిన ప్రశ్నకు శ్రీధర్ బాబు శాసనసభ వేదికగా సమాధానమిచ్చారు. ప్రణాళికారాహిత్యంతో మూతపడిన ఐటీ హబ్‌లను తిరిగి వినియోగంలోకి తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటోందని స్పష్టం చేశారు.

"హైదరాబాద్‌పై ఒత్తిడిని తగ్గించేందుకు.. నల్గొండ, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్ లాంటి టైర్ - 2 నగరాలకూ ఐటీ కంపెనీలకు విస్తరిస్తున్నాం.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో భారత్ రికార్డు!

- 80 లక్షలు దాటిన టీకా డోసుల పంపిణీ
- గర్భాశయ క్యాన్సర్‌కు ముందస్తు రక్షణ
- 14 ఏళ్ల బాలికలే ప్రధాన టార్గెట్
- ప్రభుత్వ కేంద్రాల్లో ఉచితంగా సింగిల్ డోస్
- ఆంధ్రప్రదేశ్‌లో 98 శాతానికి పైగా వ్యాక్సినేషన్
- 81 శాతంతో రెండో స్థానంలో తమిళనాడు

2 లో

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ

- తెలంగాణ సర్కార్‌కు నోటీసులు జారీ
- పర్యావరణ అనుమతులపై రిటైర్డ్ ఇంజినీర్ల పిల్
- 55 కిలోమీటర్లలో 20 కిలోమీటర్లపైనే స్టేడీ?
- మృగవాణి నేషనల్ పార్క్‌పై ఆందోళన
- ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ వద్ద నిర్మాణాలపై అభ్యంతరం
- వచ్చే నెల 16కు తదుపరి విచారణ
- ప్రాజెక్టుపై మళ్లీ మొదలైన న్యాయ వివాదం

2 లో

# కులగణనలో తెలంగాణ రోల్ మోడల్!



**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే (కుల సర్వే) దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాబోయే 2027 జాతీయ జనగణనలో బీసీ, ఓబీసీ కులగణనను తప్పనిసరిగా చేర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం మీడియాతో మాట్లాడిన మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్రంలో బీసీల జనాభాపై తెలంగాణ ప్రభుత్వం వద్ద అత్యంత ప్రామాణికమైన, కచ్చితమైన గణాంకాలు ఉన్నాయని తెలిపారు. స్థానిక సంస్థలు, విద్య, ఉద్యోగ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు విధించిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని దాటాలంటే సైంటిఫిక్ కుల గణాంకాలు చాలా అవసరమని, రాష్ట్రంలో విజయవంతంగా నిర్వహించిన సర్వే దానికి బలమైన ప్రాతిపదికగా నిలుస్తుందని మంత్రి వివరించారు. త్వరలో జరగబోయే దేశవ్యాప్త జనగణనలో బీసీ, ఓబీసీ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని, బీసీలకు జనాభా ప్రాతిపదికన పూర్తి న్యాయం జరగాలని కోరారు. "బీసీల జనాభాను సరిగ్గా లెక్కించండి.. వారికి తగినంత న్యాయం చేయండి" అని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. సామాజిక న్యాయం సాధించాలన్న లక్ష్యంతోనే తమ ప్రభుత్వం ఈ కుల సర్వేను విజయవంతంగా పూర్తి చేసిందని, కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే బాటలో నడిచి బీసీ కులాల లెక్క తేల్చి న్యాయం చేయాలని ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

# దేశాధినేతలతో మోదీ వరుస భేటీలు!

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** బ్రిక్స్ సభ్య దేశాధినేతలతో ప్రధాని నరేంద్రమోడీ భేటీ కానున్నారు. రష్యా, ఇరాన్ దేశాధినేతలతో పాటు.. ఐక్య రాజ్య సమితి సెక్రటరీ జనరల్ తో మోడీ సమావేశం అవుతారు. తొలుత రష్యా అధ్యక్షుడు పుతిన్ తో, ఆ తర్వాత ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ తో, సాయంత్రం ఐరాస సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ తో ప్రత్యేకంగా భేటీ అవుతారని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఇప్పటికే వీరంతా భారత్ కు చేరుకోగా.. చైనా అధ్యక్షుడు జిన్ పింగ్ కూడా బ్రిక్స్ సమావేశానికి రానున్నారు. దాదాపు ఏడేళ్ల తర్వాత జిన్ పింగ్ భారత్ కు వస్తుండటంతో.. ప్రధాని, జిన్ పింగ్ ల భేటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. చివరిసారిగా ఆయన 2019లో చెన్నై సమీపంలోని మామల్లపురంలో ప్రధానితో అనధికారిక సదస్సు నిమిత్తం భారత్ కు వచ్చారు. అంతకుముందు 2016లో బ్రిక్స్ సదస్సుకు వచ్చారు.

18వ బ్రిక్స్ సమావేశానికి విచ్చేసిన పుతిన్ తో ప్రధాని భేటీ అయ్యారు. రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు, కీలక రక్షణ ఒప్పందాలపై చర్చిస్తున్నారు. కాగా.. దేశ రాజధాని అయిన ఢిల్లీలో 12,13 తేదీల్లో బ్రిక్స్ సమావేశం జరుగనుండగా.. బ్రిక్స్ దేశాలైన బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా ప్రతినిధులు భారత్ కు చేరుకుంటున్నారు. ఈ సదస్సులో బ్రిక్స్ దేశాల మధ్య వ్యాపారాలను మరింత విస్తరించడం, టెక్నాలజీలో సహకారాన్ని పెంపొందించడం, ప్రధాన అంతర్జాతీయ సమస్యలపై చర్చించి, సమన్వయం చేసుకోవడం వంటి ప్రయోజనాలపై చర్చించనున్నారు.

# మూసీ ప్రాజెక్టుకు ఎన్జీటీలో ఎదురుదెబ్బ




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** రేవంత్ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుకు మళ్లీ న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యాయి. మూసీ ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పర్యావరణ అనుమతులను సవాల్ చేస్తూ తాజాగా రిటైర్డ్ ఇంజినీర్లు చెన్నైలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ దక్షిణాది బెంచ్‌ను ఆశ్రయించారు. ఈ అప్పీల్‌పై విచారణ చేపట్టిన ట్రిబ్యునల్ తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. అయితే, మూసీ ప్రక్షాళన పేరుతో చేపడుతున్న పనులకు పర్యావరణ నిబంధనలు, అనుమతులు పూర్తి లోపభుయిష్టంగా ఉన్నాయి పిటిషనర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మూసీ పరివాహక ప్రాంతం మొత్తం 55 కి.మీ ఉంటే.. కేవలం 20 కి.మీ మేర మాత్రమే స్టడీ చేశారని పేర్కొన్నారు. అదేవిధంగా ఇదే రీజియన్‌లో మృగవాణి నేషనల్ పార్క్ కూడా ఉందని పేర్కొన్నారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ సమీపంలో భారీ నిర్మాణాలు చేపట్టాలన్న నిర్ణయంతో పాటు వాణిజ్య సముదాయాల ఏర్పాటుపైనా రిటైర్డ్ ఇంజినీర్లు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతివాదిగా తెలంగాణ ప్రభుత్వం..

అయితే, పిటిషనర్ల అప్పీల్‌ను పరిశీలించిన చెన్నై ఎన్జీటీ బెంచ్.. ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. పర్యావరణ అనుమతుల జారీ, ప్రాజెక్టు అమలుకు సంబంధించిన అంశాలపై ప్రభుత్వం తన వాదనలను, సంబంధిత వివరాలను ట్రిబ్యునల్‌కు వెంటనే అందజేయాలని పేర్కొన్నది. మూసీ ప్రాజెక్టుపై గతంలోనూ ఎన్జీటీలో న్యాయపరమైన వివాదం కొనసాగింది. ఈ ఏడాది ఏప్రిల్‌లో మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టును సవాల్ చేస్తూ దాఖలైన ఓ పిటిషన్‌ను ఎన్జీటీ కొట్టివేయగా తాజా పిటిషన్‌తో మరోసారి ప్రభుత్వానికి నోటీసులు రావడం ప్రధాన్యతను సంతరించుకుంది.

విచారణ వచ్చే నెల వాయిదా..

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై రిటైర్డ్ ఇంజినీర్లు దాఖలు చేసిన అప్పీల్‌పై విచారణను ఎన్జీటీ వచ్చే నెల 16కు వాయిదా వేసింది. ఈ క్రమంలోనే ఆ రోజు జరిగే విచారణలో పర్యావరణ అనుమతులపై అప్పీల్‌దారులు లేవనెత్తిన అభ్యంతరాలు, రాష్ట్ర ప్రభుత్వం సమర్పించే వివరణలు అత్యంత కీలకం కానున్నాయి. అయితే, మూసీ ప్రక్షాళనను మొదటి నుంచి ప్రతిపక్షాలు వ్యతిరేకిస్తుండా.. తాజాగా మరోసారి నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్‌లో సదరు ప్రాజెక్టుపై పిటిషన్ దాఖలు కావడం హాట్ టాపిక్‌గా మారింది.

# యువత సత్తాతో భారత్ జోరు!

**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** భారత దేశంలోని యువశక్తి సామర్థ్యంపై సందేహాలు అవసరం లేదని 2047 నాటికి 'వికసిత భారత్' ఖాయమని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ముంబైలో జరుగుతున్న 'గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2026'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు.. బిలియన్ల కొద్దీ లావాదేవీలను సునాయాసంగా ప్రాసెస్ చేస్తున్న యూపీఐతో ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను నిర్మించడం .. మొదలుకుని, అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా నిలబడటం, అంతరిక్ష పరిశోధనల్లో నూతన సరిహద్దులను అధిగమించడం వరకు భారతదేశం తన జనాభా ప్రయోజనాన్ని (డెమోగ్రాఫిక్ డివిడెండ్) ప్రత్యక్షంగా అనుభవిస్తోందని స్పష్టం చేశారు. భారతదేశం సాధిస్తున్న అద్భుత ప్రగతికి ఇక్కడ ఉన్న యువత, నవకల్పనలే సజీవ నిదర్శనమని మంత్రి కొనియాడారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సోషల్ మీడియాలో ప్రాచుర్యం పొందిన పదబంధాన్ని ప్రస్తావిస్తూ కొందరు 'నారాజ్ ఫూఫాజీలు' (అసంతృప్త వ్యక్తులు) ఎల్లప్పుడూ భారతదేశ వేగాన్ని, దేశ యువత అపార సామర్థ్యాలను శంకించేందుకు కారణాలు వెతుకుతూనే ఉంటారని ఎద్దేవా చేశారు. భారతదేశ డెమోగ్రాఫిక్ డివిడెండ్ చేజారిపోయిందా లేక దేశానికి 'భారం'గా మారిందా అంటూ కొందరు టీవీ స్టూడియోల్లో కూర్చుని అర్థంలేని చర్చలతో సమయాన్ని వృథా చేస్తున్నారని ఆర్థిక మంత్రి విమర్శించారు. ఇలాంటి నిరాశావాదుల (నయేసేయర్స్) మాటలను పట్టించుకోకుండా దేశం సాధిస్తున్న ప్రగతిని మనమంతా వేడుకలా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశం సాధిస్తున్న డిజిటల్, సాంకేతిక పురోగతి 2047 నాటికి భారతదేశాన్ని సంపూర్ణ అభివృద్ధి చెందిన 'వికసిత భారత్'గా తీర్చిదిద్దే లక్ష్యానికి బలమైన వేగాన్ని నిర్దేశిస్తోందని నిర్మలా సీతారామన్ ధీమా వ్యక్తం చేశారు.

# ఏజెన్సీలో గుడుంబా జోరు.. ఎక్సైజ్ శాఖ నిద్రపోతోందా?

**తెలుగు గళం, ములుగు సెప్టెంబర్ 11**

ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా దందా మళ్లీ జోరందుకుంటోందనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. ఏటూరునాగారం, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం, మంగపేట, తాడ్వాయి మండలాల్లో గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నా..ఎక్సైజ్ శాఖ అధికారులు మాత్రం ఏం చేస్తున్నారనే ప్రశ్నలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఏటూరునాగారం మండలంలో గుడుంబా విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు. కేవలం అప్పుడప్పుడు దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయడం కాకుండా..గుడుంబా తయారీ కేంద్రాలు, సరఫరా మార్గాలు, రవాణా వ్యవస్థ, విక్రయదారులపై సమగ్ర నిఘా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు. గుడుంబా మత్తుకు బానిసవుతున్న కుటుంబాల్లో ఆర్థిక పరిస్థితులు దెబ్బతింటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజువారీ కూలి, వ్యవసాయం తదితర పనుల ద్వారా సంపాదించిన డబ్బులో గణనీయమైన భాగం మద్యానికి ఖర్చవుతుండటంతో భార్యా పిల్లలు ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు. మద్యం మత్తులో కుటుంబ కలహాలు, హింస, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తమవుతోంది. చిన్న వయసులోనే గుడుంబాకు అలవాటు పడుతున్న వారిపై కూడా అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

చర్యలు ఎన్ని? కేసులు ఎన్ని?

గుడుంబా దందా ఇంత బహిరంగంగా జరుగుతోందన్న ఆరోపణలు వస్తున్నప్పుడు ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖ ఎన్ని దాడులు నిర్వహించింది? ఎన్ని కేసులు నమోదు చేసింది? ఎన్ని అక్రమ తయారీ కేంద్రాలను ధ్వంసం చేసింది? ఎంతమేర గుడుంబాను స్వాధీనం చేసుకుంది? ఎన్ని వాహనాలను సీజ్ చేసింది? అనే వివరాలను ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉందని పలువురు కోరుతున్నారు. అంతేకాకుండా అక్రమ గుడుంబా వ్యాపారానికి ఎవరైనా అధికారులు లేదా సిబ్బంది పరోక్షంగా సహకరిస్తున్నారనే అనుమానాలు ఉంటే.. వాటిపై ఉన్నతస్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. "వారి వాటా ఎంత?" అనే ఆరోపణలకు తావులేకుండా ఎక్సైజ్ శాఖ తనిఖీలు, కేసులు, స్వాధీనం వివరాల్లో పూర్తి పారదర్శకత పాటించాలి అని ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు స్పందించాలి

ఏజెన్సీ ప్రాంతంలో గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలపై ప్రత్యేక బృందాలతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, అక్రమ దందా వెనుక ఉన్న ప్రధాన వ్యక్తులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే అధికారులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గుడుంబా దందాకు పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడే వరకు నిరంతర దాడులు కొనసాగించడంతో పాటు..ఏజెన్సీ ప్రాంతంలో మద్యం వ్యసనంతో నష్టపోతున్న కుటుంబాలకు అవగాహన, పునరావాస చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి గుడుంబా దందాపై సమగ్ర విచారణకు ఆదేశిస్తారా? లేక యథావిధిగా మౌనం వహిస్తారా? అనేది వేచి చూడాలి.

# హెచ్‌పీవీ వ్యాక్సిన్‌లో భారత్ రికార్డు!




**న్యూస్ డెస్క్, 11 సెప్టెంబరు (తెలుగు గళం):** దేశంలో మహిళల ఆరోగ్యాన్ని కాపాడే దిశగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక కార్యక్రమం అద్భుతమైన ఫలితాలను ఇస్తోంది. అత్యంత ప్రమాదకరంగా మారుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం చేపట్టిన జాతీయ హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్ సక్సెస్‌ఫుల్‌గా దూసుకుపోతోంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు 80 లక్షలకు పైగా హ్యూమన్ పాపిలోమావైరస్ వ్యాక్సిన్ డోసులను విజయవంతంగా పంపిణీ చేసినట్లుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారికంగా ప్రకటించింది. దేశంలోని ప్రివెంటివ్ హెల్త్‌కేర్ చరిత్రలో ఇదొక కీలక మైలురాయిగా మంత్రిత్వ శాఖ అభివర్ణించింది.

14 ఏళ్ల బాలికల లక్ష్యంగా స్పెషల్ క్యాంపెయిన్..

మహిళల ప్రాణాలను హరిస్తున్న ప్రధాన క్యాన్సర్లలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ ప్రముఖమైనది. దీనిని మూలాల నుంచే అరికట్టాలనే లక్ష్యంతో, సరిగ్గా 14 ఏళ్ల వయస్సు నిండిన బాలికలను టార్గెట్ చేస్తూ ఈ దేశవ్యాప్త మెగా క్యాంపెయిన్‌కు రూపకల్పన చేశారు. భవిష్యత్తులో ఈ మహమ్మారి బారిన పడకుండా యువతను ముందస్తుగా రక్షించడమే ఈ వ్యాక్సినేషన్ ప్రధాన ఉద్దేశం. అయితే, ప్రాణాలను రక్షించే టీకాను సామాన్యులకు కూడా అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ వైద్య కళాశాలల్లో ఈ సింగిల్ డోస్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను ఎలాంటి రుసుము లేకుండా పూర్తిగా ఫ్రీగానే అందిస్తున్నారు.

వాక్సినేషన్‌లో అగ్రగామిగా ఆంధ్రప్రదేశ్

ఈ జాతీయ ఆరోగ్య ఉద్యమంలో పలు రాష్ట్రాలు విశేష చొరవ చూపుతున్నాయి. ముఖ్యంగా జాబితాలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా దూసుకుపోతోంది. కేంద్రం అందించిన లక్ష్యాల్లో ఇప్పటికే రాష్ట్రంలోని 14 ఏళ్ల వయసు గల బాలికలకు దాదాపు 98 శాతం పైగా వ్యాక్సినేషన్‌ను పూర్తి చేసి రికార్డు సృష్టించింది. ఆ తర్వాతి స్థానంలో 81 శాతం వాక్సినేషన్‌తో తమిళనాడు ఉంది.

# ఐటీ జాబ్స్‌కు తెలంగాణ బిగ్ బూస్ట్!

మొదటి పేజీ తరువాయి



త్వరలోనే ఆదిలాబాద్‌లో ఐటీ హబ్/టవర్‌ను లాంఛనంగా ప్రారంభించబోతున్నాం. యాంకర్ పార్ట్ నర్స్/ఇండస్ట్రీ పార్ట్ నర్స్ ముందుకొస్తే కొత్తగా ఐటీ హబ్స్/టవర్లను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఆర్ఆర్ఆర్ నిర్మాణానికి కేంద్రం ఏ మాత్రం సహకరించడం లేదు. ఈ విషయంలో బీజేపీ సభ్యులు చొరవ తీసుకోవాలి. తెలంగాణ యువతకు మరిన్ని ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా మా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్తోంది. గత రెండేళ్లలో 75కి పైగా జీసీసీలు హైదరాబాద్ లో ప్రారంభమయ్యాయి. ఇది దేశంలోనే రికార్డు. రెండేళ్ల హయాంలో లక్ష మంది యువతకు కొత్తగా ఉద్యోగాలు దక్కాయి. త్వరలోనే కొత్త జీసీసీ పాలసీని తీసుకొస్తున్నాం. ఇందుకు సంబంధించిన కసరత్తు కొనసాగుతోంది. ఐటీ కంపెనీలకు సంబంధించిన కాంప్రహెన్సివ్ ఎకో సిస్టంను అభివృద్ధి చేయడంలో డేటా సెంటర్లు కీలక పాత్ర పోషించబోతున్నాయి. అందుకే.. వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాం. రాబోయే రోజుల్లో డేటా సెంటర్ల వల్ల ఏర్పడబోయే సవాళ్లను ఎదుర్కొనేలా ప్రత్యేక కార్యాచరణకు శ్రీకారం చుట్టాం. స్థానిక అవసరాలకు ఇబ్బంది తలెత్తకుండా డేటా సెంటర్లకు అవసరమైన విద్యుత్ ను అందించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. టైర్ 2, టైర్ 3 నగరాలు, పట్టణాల్లోనూ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం." అని శ్రీధర్ బాబు సమాధానమిచ్చారు.

# సీఎం బ్రదర్స్ భూదందా?

మొదటి పేజీ తరువాయి

దోటి ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని, ఈ విషయాన్ని రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. సిరిసిల్ల నియోజకవర్గంలోని సముద్రలింగాపురం ఊర్లో 800 ఎకరాలను నిషేధిత జాబితాలో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమాంతర రెవెన్యూ వ్యవస్థ నడుస్తోందని విమర్శించారు. సీఎం బ్రదర్స్ భూములను కొల్లగొడుతున్నారని, మంత్రుల ముఠా 'అలీ బాబా అరడజన్ దొంగల్లా' తయారైందని ఆరోపించారు. మంత్రుల వాటాల వివాదంలో భాగంగానే మంత్రి పదవి నుంచి ఒకరిని బర్తరఫ్ చేశారని పేర్కొన్నారు. 'తమ్ముడు లెట్స్ దూ కుమ్ముడు' అన్నట్లుగా సీఎం బ్రదర్స్ దోచుకుంటున్నారని కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

బ్లాక్‌మెయిలర్ పాలన..

గతంలో సీఎం రేవంత్ రెడ్డి ఆర్టీఐని అడ్డం పెట్టుకొని బ్లాక్‌మెయిల్ చేసేవాడని, వీరప్పన్ అటవీ శాఖ మంత్రి అయితే ఎలా ఉంటుందో.. రేవంత్ రెడ్డి అనే బ్లాక్‌మెయిలర్ ముఖ్యమంత్రి అయితే అలానే ఉందని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అత్తసొమ్ము అల్లుడికి దానం చేసినట్లుగా నగరం నడిబొడ్డున ఉన్న పారిశ్రామిక భూములను, మూసీ సుందరీకరణ పేరుతో వేల ఎకరాలను అనుచరులకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. ఫ్యూచర్ సిటీలో 200 కోట్ల విలువ చేసే భూములను కేవలం రూ.7 కోట్లకే కట్టబెట్టారని మండిపడ్డారు. 2014కు ముందు భూములు కొనాలంటే మానసిక అనుమానాలు ఉండేవి కానీ, కేసీఆర్ సీఎం అయిన తర్వాత చెరువులకు నీటిని అందించి ఎకరం 5 లక్షల భూమిని 50 లక్షలకు చేర్చారని గుర్తుచేశారు. కొంగర కలాన్ లో కలెక్టరేట్ నిర్మించి భూముల రేట్లు పెంచామని తెలిపారు. రాబోయే రెండేళ్లలో కేసీఆర్ సీఎంగా రావడం ఖాయమని, 22ఏ తో నిషేధిత జాబితాలో పెట్టిన భూములన్నింటినీ కాపాడుకుంటామని కేటీఆర్ అన్నారు.

# పేదల ఇళ్లపై మళ్లీ డ్రామా ఎందుకు?

మొదటి పేజీ తరువాయి

అధికారుల నిర్ణయాలకు విలువ లేదా?

గతంలో అధికారుల సమక్షంలో డ్రా నిర్వహించి ఇళ్లు కేటాయించిన తర్వాత ఇప్పుడు మళ్లీ డ్రా నిర్వహిస్తామని చెప్పడం పేదలకు తీవ్ర అన్యాయం చేయడమేనని జాన్ వెస్లీ అన్నారు. "గతంలో డ్రా నిర్వహించి ఇళ్లు కేటాయించిన అధికారులు అధికారులు కాదా? ఇప్పుడు తీసుకుంటున్న నిర్ణయాలే ఎందుకు చెల్లాలి?" అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేదలు ఏళ్ల తరబడి ఇళ్ల కోసం పోరాడుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్లకు ఇంటి నంబర్లు కేటాయించి విద్యుత్, తాగునీరు, రోడ్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

మంత్రి జోక్యం చేసుకోవాలి

జనగామ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ సమస్యపై తక్షణమే జోక్యం చేసుకుని, గతంలో కేటాయించిన 72 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ఆయా లబ్ధిదారులకే అందించేలా చర్యలు తీసుకోవాలని జాన్ వెస్లీ కోరారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి సీపీఎం రాష్ట్ర కమిటీ తీసుకెళ్తుందని తెలిపారు. పేదల సమస్య పరిష్కారం కాకపోతే న్యాయపోరాటాన్ని కొనసాగించడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని చేపడతామని ఆయన హెచ్చరించారు. పేదల ఇళ్ల విషయంలో ప్రభుత్వం మొండివైఖరి వీడి, గతంలో తీసుకున్న అధికారిక నిర్ణయాలను గౌరవించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.డి. అబ్బాస్, జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, జిల్లా నాయకులు ఇర్రి అహల్య, బోట్ల శేఖర్, రాపర్తి రాజు, సింగారపు రమేష్, బూడిది గోపి, సుంచు విజేందర్, చందు నాయక్, ఎం.డి. అజారుద్దీన్, బోడ నరేందర్, మూడో వార్డు కౌన్సిలర్ బూడిది జ్యోతి, లబ్ధిదారుల సంఘం అధ్యక్షుడు కళ్యాణం లింగం తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కులపై కేంద్రం కుట్రలు చేస్తోంది

మొదటి పేజీ తరువాయి



జాతీయ ఆహార భద్రత చట్టంలో కేంద్రం చేసే సవరణల వల్ల వికలాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని అన్నారు. ఆహార భద్రత వికలాంగుల హక్కు అని, ఆ హక్కును తొలగించే అధికారం కేంద్రానికి లేదని స్పష్టం చేశారు.

2016 వికలాంగుల హక్కుల చట్టం అమలు, పర్యవేక్షణ కోసం జాతీయ స్థాయిలో చీఫ్ కమిషనర్, రాష్ట్ర స్థాయిలో స్టేట్ కమిషనర్లను నియమించాల్సి ఉందని తెలిపారు. అయితే ఆర్‌పీడీ చట్టంలోని సెక్షన్ 74లో కమిషనర్‌గా ఎవరినైనా నియమించే అవకాశం ఉండటం సరికాదన్నారు. వికలాంగుల సమస్యలను అర్థం చేసుకున్న వికలాంగులనే జాతీయ, రాష్ట్ర స్థాయి కమిషనర్లుగా నియమించే విధంగా సెక్షన్ 74ను సవరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో వికలాంగులకు కల్పిస్తున్న రిజర్వేషన్‌ను తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఎన్‌పీఆర్‌డీ ఆరోపించింది. కేంద్ర వికలాంగుల శాఖ ప్రధాన కమిషనర్ నివేదికలో వికలాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను ప్రస్తావించినప్పటికీ, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించింది. యూపీఎస్సీ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో 48వ ర్యాంకు సాధించిన అభ్యర్థికి సర్వీస్ కేటాయించకపోవడం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో దృష్టిలోపం ఉన్నవారికి పోస్టు రిజర్వేషన్ ఉన్నప్పటికీ కేటాయించకపోవడం, ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాలో మేధో వైకల్యం ఉన్న వ్యక్తికి ఉద్యోగం నిరాకరించడం వంటి ఘటనలు ఆందోళనకరమని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులను గుర్తించి, వాటిని భర్తీ చేసేందుకు ప్రత్యేక నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసింది. వికలాంగులకు అనుకూలంగా సామూహిక ప్రాంతాలను అందుబాటులోకి తీసుకురావాలనే నిర్ణయంలో కూడా ఆశించిన పురోగతి లేదని విమర్శించింది. అందుబాటులో లేని డిజిటల్ వ్యవస్థలను వికలాంగులు ఎలా వినియోగించుకోగలరని ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న అనేక చట్టాలు, సంక్షేమ పథకాలు, విధానాలు కాగితాలకే పరిమితమవుతున్నాయని ఎన్‌పీఆర్‌డీ విమర్శించింది. 2012 నుంచి వికలాంగుల పెన్షన్లలో కేంద్రం వాటా కేవలం రూ.300గా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. నేటి పరిస్థితుల్లో రూ.300తో వికలాంగులు ఎలా జీవించగలరని ప్రశ్నిస్తూ, కేంద్రం తన వాటాను రూ.3,000కు పెంచాలని డిమాండ్ చేసింది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న జనాభా లెక్కల్లో 21 రకాల వైకల్యాలకు బదులుగా కేవలం 9 రకాల వైకల్యాల వివరాలను మాత్రమే సేకరించాలనే నిర్ణయం తీసుకుందని ఆరోపించింది. 21 రకాల వైకల్యాల వివరాలను పూర్తిస్థాయిలో సేకరించకపోతే దేశవ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించింది. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వికలాంగుల హక్కుల అమలును నిర్లక్ష్యం చేస్తోందని ఎన్‌పీఆర్‌డీ ఆరోపించింది. వికలాంగులు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేసే ప్రయత్నాలను తిప్పికొడతామని స్పష్టం చేసింది. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నవంబర్, డిసెంబర్ నెలల్లో దేశవ్యాప్త ప్రచార ఉద్యమం నిర్వహించాలని జాతీయ కార్యవర్గం నిర్ణయించింది. సమావేశంలో ఎన్‌పీఆర్‌డీ జాతీయ అధ్యక్షుడు గిరీష్ కీర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ నంబు రాజన్, ఉపాధ్యక్షులు ఎం.అడివయ్య, అనిర్బన్ ముఖర్జీ, ఝాన్సీరాణి, సహాయ కార్యదర్శులు సామ్య గంగూలీ, రిషికేష్, కోశాధికారి చక్రవర్తి, కమిటీ సభ్యులు కె.వెంకట్, ఆర్.వెంకటేష్, జె.రాజు, రంగప్ప, రాజన్, విల్సన్‌తో పాటు వివిధ రాష్ట్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ, ఎస్టీ బాధితుల ఎక్స్‌గ్రేషియా విడుదల చేయాలి

### కులాంతర వివాహితుల ప్రోత్సాహక నగదు బకాయిలను వెంటనే చెల్లించాలి: కేవీపీఎస్





తెలుగు గళం న్యూస్ నల్లగొండ, సెప్టెంబర్ 11

నల్లగొండ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల నిరోధక చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు గత మూడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియా నిధులను వెంటనే విడుదల చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలడుగు నాగార్జున డిమాండ్ చేశారు.జిల్లాలో 102 కేసులకు సంబంధించి 180 మంది బాధితులకు అందాల్సిన పరిహారం పెండింగ్‌లో ఉందని తెలిపారు.అలాగే కులాంతర వివాహాలు చేసుకున్న 250 జంటలకు ప్రభుత్వం అందించాల్సిన రూ.2.5 లక్షల ప్రోత్సాహక నగదు బకాయిలను కూడా తక్షణమే చెల్లించాలని కోరారు.ఈ డిమాండ్ల సాధన కోసం కేవీపీఎస్ నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అనంతరం జిల్లా డీఆర్వో దశరథ్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా పాలడుగు నాగార్జున మాట్లాడుతూ..ఎస్సీ, ఎస్టీ దౌర్జన్యాల కేసుల్లో బాధితులైన కుటుంబాలకు చట్ట ప్రకారం వివిధ దశల్లో అందాల్సిన ప్రభుత్వ పరిహారం మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటం ఆందోళనకరమన్నారు.బాధిత కుటుంబాల్లో అత్యధికులు పేదలు, ఆర్థికంగా వెనుకబడిన వారేనని, వారికి సకాలంలో పరిహారం అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు మరింత తీవ్రమవుతున్నాయని అన్నారు.కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సమానత్వం కోసం కులాంతర వివాహాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని నాగార్జున పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రకటించిన కులాంతర వివాహ ప్రోత్సాహక నగదు కూడా మూడేళ్లుగా పెండింగ్‌లో ఉండటం బాధాకరమన్నారు.లబ్ధిదారులు సంబంధిత కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా సరైన సమాధానం లభించడం లేదని తెలిపారు.నిధుల మంజూరులో జాప్యం, సంబంధిత శాఖల మధ్య సమన్వయ లోపం కారణంగా వందలాది మంది లబ్ధిదారులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారని ఆయన విమర్శించారు.జిల్లా కలెక్టర్ ప్రత్యేకంగా జోక్యం చేసుకుని పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష నిర్వహించి, అర్హులైన ప్రతి బాధితుడు, లబ్ధిదారుడికి ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఎస్సీ, ఎస్టీ బాధితుల ఎక్స్‌గ్రేషియాతో పాటు కులాంతర వివాహ ప్రోత్సాహక నగదు భవిష్యత్తులో పెండింగ్ కాకుండా సకాలంలో నిధులు విడుదల చేయాలని కోరారు.ధర్నాలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు కొండేటి శ్రీను, జిల్లా ఉపాధ్యక్షులు గాదె నరసింహ, ఒంటెపాక కృష్ణ, సహాయ కార్యదర్శులు బొల్లు రవీంద్ర కుమార్, కోడిరెక్క మల్లన్న, జిల్లా కమిటీ సభ్యులు దైద శ్రీను, దంతాల నాగార్జున, దైదా దేవయ్య, బొల్లంపల్లి పాపారావు, దున్న అచ్చాలు, బొంగరాల వెంకటయ్య, మాతంగి రవికుమార్, దోరేపల్లి మల్లయ్య, వెంకట్, బండి నారాయణ, లింగస్వామి, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## రెసిడెన్స్ సర్టిఫికెట్‌పై రెవెన్యూ కార్యాలయంలో గందరగోళం!

- ఉద్యోగం సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ కష్టాలు..
- గతంలో ఇచ్చినవే ఇప్పుడు ఎందుకు ఇవ్వరు?
- రూల్స్ మారాయా..అధికారులు మారారా?
- గడువు ముగిస్తే ఉద్యోగార్థుల భవిష్యత్తుకు బాధ్యులెవరు?




ధర్మసాగర్ (తెలుగు గళం), సెప్టెంబర్ 11

ఏళ్ల తరబడి కష్టపడి చదివి.. పోటీ పరీక్షల్లో విజయం సాధించి..ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులకు ఇప్పుడు ఓ ధ్రువపత్రం చుక్కలు చూపిస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగ వెరిఫికేషన్ కోసం అవసరమైన సర్టిఫికెట్ ఆఫ్ రెసిడెన్స్ కోసం ధర్మసాగర్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయిస్తున్న అభ్యర్థులు రోజుల తరబడి కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఒకటో తరగతి చదవకుండా రెండో తరగతి నుంచి పాఠశాలలో చేరిన కొందరు అభ్యర్థులకు మొదటి తరగతి స్టడీ సర్టిఫికెట్ అందుబాటులో లేకపోవడంతో, ఉద్యోగ వెరిఫికేషన్‌లో ప్రత్యామ్నాయ ధ్రువపత్రంగా రెసిడెన్స్ సర్టిఫికెట్ అవసరమవుతోందని వారు చెబుతున్నారు.అయితే సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ ప్రక్రియ ముందుకు సాగడం లేదని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు.

### గతంలో ఇచ్చారు కదా..ఇప్పుడు ఎందుకు ఇవ్వరు?

ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది.గతంలో ధర్మసాగర్ మండలంలో పనిచేసిన తహసీల్దార్‌లు ఇదే తరహా పరిస్థితుల్లో పలువురికి రెసిడెన్స్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు అభ్యర్థులు చెబుతున్నారు. మరి అప్పట్లో ఏ నిబంధనల ప్రకారం ఇచ్చారు? ఇప్పుడు అదే తరహా దరఖాస్తులకు ఎందుకు అభ్యంతరాలు వస్తున్నాయి? రూల్స్ మారాయా? లేక అధికారుల అవగాహన మారిందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

గతంలో జారీ చేసిన సర్టిఫికెట్లకు సంబంధించిన రికార్డులు కార్యాలయంలో ఉన్నట్లయితే వాటిని పరిశీలించి ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై లేదా? అని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

### ఉద్యోగం వచ్చిందనుకునేలోపే..సర్టిఫికెట్ అడ్డంకి!

పోటీ పరీక్షలో విజయం సాధించడం అంత సులభం కాదు.సంవత్సరాల తరబడి చదువు, కఠినమైన పోటీ, ఎన్నో ప్రయత్నాల తర్వాత ఉద్యోగానికి ఎంపికైన అభ్యర్థులు చివరి దశలో సర్టిఫికెట్ సమస్యతో ఆగిపోతే వారి పరిస్థితి ఏమిటి? నిర్ణీత గడువులోపు వెరిఫికేషన్ పత్రాలు సమర్పించలేకపోతే ఉద్యోగ అవకాశం కోల్పోయే పరిస్థితి వస్తే దానికి బాధ్యత ఎవరిది?ఒక అధికారి నిర్ణయం..ఒక ఉద్యోగార్థి భవిష్యత్తు! అందుకే నిబంధనల పేరుతో అభ్యర్థులను రోజుల తరబడి తిప్పకుండా, వారి దరఖాస్తులను పూర్తిస్థాయిలో పరిశీలించి అర్హత ఉంటే వెంటనే ధ్రువపత్రం జారీ చేయాలని వారు కోరుతున్నారు.

### స్పష్టత ఇవ్వాల్సింది ఎవరు?

ఒకవైపు గతంలో ఇదే కార్యాలయం నుంచి సర్టిఫికెట్లు జారీ చేసిన ఉదాహరణలు ఉన్నాయని అభ్యర్థులు చెబుతుండగా, మరోవైపు ప్రస్తుతం వాటిపై స్పష్టత లేదనే పరిస్థితి నెలకొనడం పలు అనుమానాలకు తావిస్తోంది. నిబంధనలు నిజంగా అనుమతించకపోతే ఎందుకు అనుమతించవు? అనే విషయాన్ని రాతపూర్వకంగా స్పష్టం చేయాలి. నిబంధనలు అనుమతిస్తే ఎందుకు జారీ చేయడం లేదు? అన్నది కూడా అధికారులు చెప్పాల్సిందే.ఉద్యోగ వెరిఫికేషన్ గడువు దగ్గరపడుతున్న సమయంలో కార్యాలయం చుట్టూ తిప్పడం కాకుండా సమస్యకు తక్షణ పరిష్కారం చూపాలని అభ్యర్థులు కోరుతున్నారు.

### జిల్లా ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలి

ఇది సాధారణ ధ్రువపత్రం సమస్యగా చూడకుండా ఉద్యోగార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంగా పరిగణించాలని పలువురు కోరుతున్నారు. గతంలో జారీ చేసిన రెసిడెన్స్ సర్టిఫికెట్ల రికార్డులను పరిశీలించి, అవి ఏ నిబంధనల ఆధారంగా జారీ అయ్యాయో వెల్లడించాలని, ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులకు సర్టిఫికెట్లు జారీ చేయడంపై స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని జిల్లా ఉన్నతాధికారులను కోరుతున్నారు."ఉద్యోగం సాధించిన వాళ్లను ఒక సర్టిఫికెట్ కోసం కార్యాలయాల చుట్టూ తిప్పడం కాదు..నిబంధనల ప్రకారం సమస్యకు పరిష్కారం చూపాలి" అని అభ్యర్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## విద్యుత్ ఉత్పత్తి తగ్గినా..వినియోగానికి సరిపడా సరఫరా

- విద్యుత్ వృథాను అరికట్టి పొదుపు పాటించాలి
- ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ టి.మధుసూధన్

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 11

రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల కారణంగా విద్యుత్ ఉత్పత్తి తగ్గడంతో పాటు ఎండల తీవ్రత వల్ల విద్యుత్ డిమాండ్ భారీగా పెరిగినప్పటికీ వినియోగానికి అనుగుణంగా సరఫరా అందిస్తున్నామని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్/ఆపరేషన్ టి.మధుసూధన్ తెలిపారు. ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ప్రత్యేక కార్యాచరణతో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.స్టేషన్ ఘనపూర్ డివిజన్ పరిధిలోని చిల్పూర్ మండలం రాజవరం 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రంతో పాటు చిన్నపెండ్యాల, మల్కాపూర్, లింగంపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పరిస్థితిని డీఈ ఆపరేషన్ బి.సారయ్యతో కలిసి డైరెక్టర్ టి.మధుసూధన్ శుక్రవారం పరిశీలించారు.ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందితో విద్యుత్ సరఫరా, లోవోల్టేజ్, ఓవర్‌లోడ్, అంతరాయాలపై సమీక్షించారు.విద్యుత్ వినియోగదారులు అవసరం లేని సమయంలో విద్యుత్ వినియోగాన్ని తగ్గించి పొదుపులో భాగస్వాములు కావాలని ఆయన కోరారు. విద్యుత్ వృథాను అరికట్టడం ద్వారా పెరుగుతున్న డిమాండ్‌ను సమర్థవంతంగా ఎదుర్కోవచ్చన్నారు.నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం ద్వారా విద్యుత్ సరఫరాలో అంతరాయాలను గణనీయంగా తగ్గిస్తున్నామని తెలిపారు. అవసరాన్ని బట్టి నూతన సబ్‌స్టేషన్లు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి ఓవర్‌లోడ్, లోవోల్టేజ్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నామని చెప్పారు.వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అంతరాయాలను వేగంగా గుర్తించి పరిష్కరించేలా నూతన సాంకేతిక విధానాలతో మానవరహిత సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు.విద్యుత్ ప్రమాదాల నివారణకు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ సిబ్బంది వినియోగదారులకు అందుబాటులో ఉండి సరఫరాలో సమస్య తలెత్తిన వెంటనే స్పందించాలన్నారు.సిబ్బంది, వినియోగదారులు పరస్పరం మర్యాదగా వ్యవహరించాలని సూచించారు.ప్రజాబాట వంటి కార్యక్రమాల ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతున్నాయని,



ప్రజలు ఇలాంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.సిబ్బంది 'వన్ మినిట్ రూల్' విధానాన్ని పాటిస్తూ వినియోగదారులకు విద్యుత్ భద్రతపై అవగాహన కల్పించాలని సూచించారు. మొబైల్ యాప్ ద్వారానే ఎల్‌సీలు తీసుకుని సురక్షితంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏడీఈ పి.రణధీర్‌రెడ్డి, ఏఈలు ఆర్.సురేష్, శ్వేత, పి.శంకర్, శివకుమార్, ఎస్ఎల్ఐ నీలం ఐలేష్, ఎల్ఐ జి.కృష్ణంరాజు, ఆర్టిజన్ ఎం.వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి: సిపి సునీల్ దత్"



ఖమ్మం, సెప్టెంబర్11 (తెలుగు గళం) న్యూస్: వినాయక నవరాత్రి ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు పరస్పరం సహకరించాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ కోరారు. శుక్రవారం ఖమ్మం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో శాంతి కమిటీ సభ్యులతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సెప్టెంబర్ 14 నుంచి ప్రారంభమయ్యే గణేష్ ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. విగ్రహాల ఊరేగింపు, నిమజ్జన సమయంలో నిర్ణయించిన మార్గాలు, సమయాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే పుకార్లు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని, అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు, బాలకృష్ణ, భానుప్రకాష్ పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జనానికి పుట్లకుంట చెరువు ముస్తాబు

### ఘనపూర్‌లో ముందస్తు ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు..చెరువు వద్ద మరమ్మతులు



తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, సెప్టెంబర్ 11

వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో భాగంగా స్టేషన్ ఘనపూర్‌లో వినాయక నిమజ్జనం నిర్వహించే పుట్లకుంట చెరువును వివిధ శాఖల అధికారులు, సిబ్బంది సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.చెరువులో నీటి లెవెల్‌ను పరిశీలించడంతో పాటు నిమజ్జన సమయంలో భక్తులు, నిర్వాహకులకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మరమ్మతు పనులను చేపట్టారు.చెరువు పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు.విగ్రహాలను సులభంగా చెరువు వద్దకు తీసుకెళ్లే విధంగా చెరువు అంచులను జేసీబీ సహాయంతో చదును చేయడంతో పాటు అవసరమైన ప్రాంతాల్లో లోతు పెంచే పనులు చేపట్టారు.నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.ఈ ముందస్తు ఏర్పాట్లలో ఆర్డీవో, ఏసీపీ, స్టేషన్ ఘనపూర్ అధికారులు, మున్సిపల్ కమిషనర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఏఈ, శానిటేషన్ సిబ్బంది, సీఐ, ఎస్ఐ, విద్యుత్ శాఖ ఏఈ, డీఈ, నీటిపారుదల శాఖ ఏఈ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కూనూరు పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ

తెలుగు గళం న్యూస్ జఫర్గఢ్ సెప్టెంబర్ 11




కోనూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎక్స్ట్రా మెయిల్ స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగో, ఐదో తరగతులకు చెందిన 50 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను దానం చేశారు.విద్యార్థుల విద్యాభ్యాసానికి అవసరమైన సామగ్రిని అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇటువంటి సహాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక బృందం, విద్యార్థులతో పాటు సామాజిక కార్యకర్త పల్లె రాజిరెడ్డి పాల్గొన్నారు.విద్యార్థులకు బ్యాగులను అందజేసి వారిని అభినందించారు.ఫౌండేషన్ నిర్వాహకులను పాఠశాల సిబ్బంది ప్రశంసించారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘన్‌పూర్, సెప్టెంబర్ 11



స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఫైర్ ఆఫీసర్ ఎన్. దేవేందర్ అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాద సమయంలో వ్యవహరించాల్సిన విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలను విద్యార్థులకు వివరించారు.అగ్నిమాపక పరికరాలను ఎలా ఉపయోగించాలో ఆచరణాత్మకంగా చేసి చూపించారు. ప్రమాద సమయంలో భయాందోళనలకు గురికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు.కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పెద్దపల్లి శారద, కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### తిరుమలగిరిలో ఘనంగా పోషణ మాసోత్సవాలు



తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ

అంగన్‌వాడీ కేంద్రాలు చిన్న పిల్లల ఆరోగ్య భద్రతతో పాటు విద్యాభివృద్ధికి నిలయాలని,వీటిని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అన్నారు.శుక్రవారం మండలంలోని తిరుమలగిరి అంగన్‌వాడీ కేంద్రంలో జిల్లా కలెక్టర్,సంక్షేమ శాఖ అధికారుల ఆదేశాల మేరకు పోషణ మాసం,బాల్య వివాహాల నివారణ,సఖి సేవలపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా జెండర్ స్పెషలిస్ట్ అనూష మాట్లాడుతూ.. రక్తహీనత,పోషకాహార లోపాన్ని నివారించేందుకు కేంద్రాల ద్వారా నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపి,1098 చైల్డ్ హెల్ప్‌లైన్ గురించి అవగాహన కల్పించారు.అనంతరం సఖి కేంద్రం అడ్మిన్ గాయత్రి మాట్లాడుతూ..ఆపదలో ఉన్న మహిళల రక్షణ కోసం 181 హెల్ప్‌లైన్,ఉచిత వసతి,వైద్యం,న్యాయ సహాయం అందుబాటులో ఉన్నాయని వివరించారు.మిషన్ కో-ఆర్డినేటర్ కృష్ణ పోక్సో చట్టం,బాల్య వివాహాల శిక్షలు,వయోవృద్ధుల హెల్ప్‌లైన్ 14567 గురించి వివరించారు.కార్యక్రమంలో ఉప సర్పంచ్ తిరుపతి,అంగన్‌వాడీ టీచర్లు కవిత,వాసవి,రజిత,కల్పనతో పాటు గర్భిణులు,బాలింతలు,బాలికలు పాల్గొన్నారు.

# నీట్‌లో సత్తా చాటిన జనగామ బంజారా విద్యార్థినులు

## ● మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీట్లు.. ● అక్షయ, ప్రియహర్షినిలకు ఘన సన్మానం




**తెలుగు గళం న్యూస్ జనగామ సెప్టెంబర్ 11**

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష(నీట్)లో ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించి, మొదటి ప్రయత్నంలోనే ఎంబీబీఎస్ సీట్లు సాధించిన జనగామ పట్టణానికి చెందిన బంజారా విద్యార్థినులు లకావత్ అక్షయ, లకావత్ ప్రియహర్షినిలకు జనగామలో బంజారా నాయకులు ఘనంగా సన్మానం చేశారు.విద్యార్థినుల విజయాన్ని బంజారా సమాజానికి గర్వకారణంగా అభివర్ణించారు.లకావత్ అక్షయ తల్లిదండ్రులు లకావత్ లాల్కు, లలిత కాగా, లకావత్ ప్రియహర్షిని తల్లిదండ్రులు లకావత్ రాజయ్య, సుజాత. విద్యార్థినులు పట్టుదలతో చదివి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటడం అభినందనీయమని నాయకులు పేర్కొన్నారు.వారి విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని బంజారా సమాజంలోని విద్యార్థులు ఉన్నత విద్యపై దృష్టి సారించాలని సూచించారు.

**సమాజానికి సేవ చేయాలి**

ఎంబీబీఎస్ విద్యను విజయవంతంగా పూర్తి చేసి మంచి వైద్యులుగా పేరు సంపాదించడంతో పాటు, భవిష్యత్తులో బంజారా సమాజానికి తిరిగి సేవ చేయాలని నాయకులు ఆకాంక్షించారు. విద్య ద్వారా సాధించిన ఉన్నతిని సమాజ అభివృద్ధికి ఉపయోగించి ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. తమ విజయాన్ని కేవలం వ్యక్తిగత విజయంగా కాకుండా సమాజానికి ఉపయోగపడే అవకాశంగా మలచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థినులను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు.కార్యక్రమంలో భూక్య వాసు నాయక్, అజ్మీరా స్వామి నాయక్, లకావత్ నరేష్ నాయక్, భూక్యా చందు నాయక్, వాంకుడోత్ భిక్కోజీ, ధరావత్ నాగేందర్ నాయక్, గూగులోత్ లచ్చిరాం నాయక్, బానోతు దసరు నాయక్, డాక్టర్ రఘు నాయక్, అజ్మీరా వంశీ నాయక్, గుగులోతు విజయ్ నాయక్, జాటోత్ నరసింహ నాయక్, జాటోత్ లచ్చిరాం నాయక్, భూక్య దేవా నాయక్, గూగులోత్ వెంకన్న నాయక్, బానోత్ వెంకన్న నాయక్, లకావత్ శంకర్ నాయక్, ధరావత్ రాజు నాయక్, ధరావత్ శంకర్ నాయక్, బానోత్ నాగరాజు నాయక్, బానోత్ కృష్ణ, వెంకన్న, గుగులోత్ బిక్కు తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ లో చేరిన కక్కిరాలపల్లి సర్పంచ్ దంపతులు



**తెలుగు గళం న్యూస్ ఐనవోలు/సెప్టెంబర్ 11**

కక్కిరాలపల్లి గ్రామ సర్పంచ్ బర్ల వాణి రవికుమార్ దంపతులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్ లో ప్రదేశ్ కాంగ్రెస్ ముఖ్యుడు మహేష్ కుమార్ గౌడ్ చేతుల మీదుగా కండువా కప్పుకొని పార్టీలోకి చేరారు.వర్ధన్నపేట శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ఆధ్వర్యంలో కొనసాగుతున్న ప్రజా పాలన, నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు.

అభివృద్ధి పథంలో నియోజకవర్గం

శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామీణ ప్రాంతాల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నారని సర్పంచ్ దంపతులు పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు,ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలుకు శాసనసభ్యుడు చేస్తున్న కృషి తమను ఆకట్టుకుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన అనంతరం సర్పంచ్ బర్ల వాణి రవికుమార్ దంపతులు మంత్రి సీతక్కను మరియు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా కాంగ్రెస్ పార్టీలో చేరిన సర్పంచ్ దంపతులకు వారు అభినందనలు తెలిపారు.ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తున్న శాసనసభ్యుడు కేఆర్ నాగరాజు నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి, శాసనసభ్యుడికి అండగా నిలుస్తామని బర్ల వాణి రవికుమార్ దంపతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఐనవోలు మండల అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్,రాష్ట్ర అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్, ఐనవోలు కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ ల సంఘం మండల అధ్యక్షుడు పోలేపల్లి శంకర్ రెడ్డి, జన్నెపురెడ్డి, రుగ్వేదరెడ్డి, సీనియర్ నాయకులు మహమూద్, రావుల రవి, కంజర్ల తిరుపతి, కంజర్ల రవీందర్, అబ్బాస్ అలీ, కంజర్ల కుమార్, కాటబోయిన కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలకు లోబడి వినాయక ఉత్సవాలు నిర్వహించాలి:ఎస్ఐ త్రిలోక్ నాథ్ రెడ్డి






**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లి గోరి**

వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలను ప్రజలంతా సోదరభావంతో,ప్రశాంత వాతావరణంలో, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించుకోవాలని కొత్తపల్లి గోరి ఎస్ఐ ఎస్.త్రిలోక్ నాథ్ రెడ్డి సూచించారు.శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో మండల పరిధిలోని వివిధ గ్రామాల వినాయక ఉత్సవ కమిటీ నిర్వాహకులతో ప్రత్యేక సమన్వయ సమావేశం నిర్వహించి,పాటించాల్సిన మార్గదర్శకాలపై దిశానిర్దేశం చేశారు.ఉత్సవాల్లో డీజేల వినియోగాన్ని ప్రభుత్వం పూర్తిగా నిషేధించిందని,కాబట్టి ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలను ఏర్పాటు చేయరాదని స్పష్టం చేశారు.అధిక శబ్దాలు వెలువరించే సౌండ్ సిస్టమ్స్‌ను వాడరాదని,ప్రజలకు అసౌకర్యం కలిగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మండపాల ఏర్పాటు కోసం పోలీస్ శాఖ అధికారిక ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుని ముందస్తు అనుమతులు పొందాలని పేర్కొన్నారు.వాహనాల రాకపోకలకు,ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండపాలను నిర్మించాలని,విద్యుత్ కనెక్షన్లు,వైర్ల విషయంలో అప్రమత్తంగా ఉంటూ అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు.రాత్రి వేళల్లో మండపాల వద్ద భద్రతను నిర్వాహకులే స్వయంగా పర్యవేక్షించాలన్నారు.ప్రస్తుతం పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రతి మండపం వద్ద 'సైబర్ వినాయక' పోస్టర్లను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని ఎస్ఐ ఆదేశించారు.ఓటీపీలు,బ్యాంకింగ్ వివరాలు ఎవరికీ చెప్పవద్దని,అనుమానాస్పద లింకుల బారిన పడవద్దని భక్తులకు అవగాహన కల్పించాలన్నారు.ఇతర మతాల మనోభావాలు దెబ్బతినేలా ఎలాంటి వివాదాస్పద చర్యలకు తావివ్వరాదని,సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెట్టవద్దని స్పష్టం చేశారు.విగ్రహాల ఊరేగింపు,నిమజ్జనం సమయాల్లో పోలీసులు సూచించిన మార్గాలు,సమయపాలన పాటించాలని కోరారు.ఉత్సవాలు శాంతియుతంగా,సురక్షితంగా ముగిసేందుకు కమిటీల నిర్వాహకులు పోలీసులకు పూర్తిస్థాయిలో సహకరించాలని విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో స్థానిక పోలీసు సిబ్బందితో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# హసన్‌పర్తిలో మహిళ అదృశ్యం కేసు

**దారుణ హత్యగా తేల్చిన పోలీసులు**

**పెళ్లి పేరుతో బళ్లారికి రప్పించి గొంతు నులిమి హత్య**

**మృతదేహాన్ని ముక్కలుగా నరికి అడవిలో పడేసిన నిందితుడు**






**హన్మకొండ/హసన్‌పర్తి, సెప్టెంబర్ 11 (తెలుగు గళం)**

హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో సంచలనం సృష్టించిన మహిళ అదృశ్యం కేసు దారుణ హత్యగా తేలింది. మే 15న అదృశ్యమైన తౌటం స్వప్న (40)ను ఆమెకు పరిచయస్తుడైన కర్ణాటకకు చెందిన యువకుడు హత్య చేసినట్లు పోలీసులు వెల్లడించారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వొద్దిరాజుల బసవరాజ్ (27)ను శుక్రవారం అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం..బళ్లారి జిల్లా గుడుదూరుకు చెందిన బసవరాజ్‌కు స్వప్నతో పరిచయం ఉంది. తనను పెళ్లి చేసుకోవాలని స్వప్న ఒత్తిడి చేయడంతో పాటు, పెళ్లికి నిరాకరిస్తే తమ ఫొటోలు, వీడియోలను బయటపెడతానని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. దీంతో పరువు పోతుందనే భయంతో ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించి బళ్లారికి రప్పించిన బసవరాజ్..గావి సిద్ధేశ్వర ఆలయం సమీపంలోని అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి గొంతు నులిమి హత్య చేసినట్లు వెల్లడించారు.ముక్కలుగా నరికి..అడవిలో పడేసి..హత్య చేసిన మరుసటి రోజు రాత్రి మటన్ కత్తితో మృతదేహాన్ని ముక్కలుగా నరికి అటవీ ప్రాంతంలో పడేసినట్లు నిందితుడు విచారణలో అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. హత్య సమయంలో రక్తం అంటుకున్న దుస్తులను పెట్రోల్‌తో తగులబెట్టినట్లు, స్వప్న సెల్‌ఫోన్‌ను చెరువులో పడేసినట్లు పేర్కొన్నారు.వాహన తనిఖీల్లో చిక్కిన నిందితుడు స్వప్న తండ్రి అమంచ రాజేందర్ ఫిర్యాదు మేరకు మే 31న హసన్‌పర్తి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాల ద్వారా హత్యకు సంబంధించిన కీలక ఆధారాలను సేకరించారు. ఈ క్రమంలో శుక్రవారం అంబాల--కమలాపూర్ రోడ్డులో పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా బసవరాజ్ పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. పోలీసులు అతడిని వెంబడించి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. అతడి వద్ద నుంచి రియల్‌మీ సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.నిందితుడిపై బీఎన్ఎస్ సెక్షన్లు 103, 238 కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. కేసును ఛేదించిన హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్, ఎస్ఐలు సుజిత్, రవి, దేవేందర్, ఏఏఓ సల్మాన్ పాషా, సిబ్బంది బావ్‌సింగ్, తిరుపతి, సుమన్, సోమన్న, పూర్ణచారి, నవీన్‌లను ఉన్నతాధికారులు అభినందించారు.

# కోనరావుపేటలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి కొత్తపల్లిగోరి**






మండల పరిధిలోని కోనరావుపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఎస్ఐ ఎస్.సాయి త్రిలోక్ నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో సివిల్,టీజీఎస్పీ సిబ్బందితో కలిసి గ్రామంలోని ప్రధాన రహదారులు,ముఖ్య కూడళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టారు.అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి,సరైన ధ్రువపత్రాలు లేని వాహనదారులపై నిబంధనల ప్రకారం జరిమానాలు విధించారు.వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని,డ్రైవింగ్ చేస్తూ ఫోన్ మాట్లాడవద్దని సూచించారు.అనంతరం ప్రజలతో మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల వల్ల జరిగే నష్టాలను వివరించి,యువత వీటికి బానిస కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు.అలాగే సైబర్ నేరాల బారిన పడకుండా బ్యాంకింగ్ వివరాలు,ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దని సూచించారు.శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని ఎస్ఐ తెలిపారు.

# బీఆర్ఎస్ వైఖరికి నిరసనగా రేగొండలో కాంగ్రెస్ ధర్నా



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి రేగొండ**

కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి,సంక్షేమంపై దృష్టి సారిస్తుంటే,బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీని వేదికగా చేసుకుని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పున్నం రవి విమర్శించారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి,పీసీసీ చీఫ్ బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్,ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు,డీసీసీ అధ్యక్షుడు బట్టు కరుణాకర్ ఆదేశాల మేరకు శుక్రవారం మండల కేంద్రంలోని ఇందిరాగాంధీ కూడలి వద్ద పరకాల–భూపాలపల్లి ప్రధాన రహదారిపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా పున్నం రవి మాట్లాడుతూ.. సభా నియమాలను ఉల్లంఘిస్తూ స్పీకర్ పదవిని,దళితులను అవమానించేలా బీఆర్ఎస్ నేతలు వ్యవహరించడం ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టన్నారు.ప్రజా సమస్యలను పక్కనపెట్టి వ్యక్తిగత దూషణలు,రాజకీయ కక్షలకు ప్రాధాన్యతనిచ్చే విధానాన్ని బీఆర్ఎస్ మానుకోవాలని డిమాండ్ చేశారు.అనంతరం ప్రజాస్వామ్య పరిరక్షణకు,సామాజిక న్యాయానికి మద్దతుగా పెద్దపెట్టున నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టయ్య,నాయకులు ఇప్పకాయల నరసయ్య,ముల్కనూరు బిక్షపతి,మేకల బిక్షపతి,సర్పంచులు వానరాశి మౌనిక–అంజి,సుదర్శన్,గ్రామ శాఖ అధ్యక్షుడు ఏనుగు రవీందర్ రెడ్డి,మాజీ ఎంపీటీసీలు,స్థానిక నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నేడు జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ... జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ నాగరాజు

**ఖమ్మం,సెప్టెంబర్11 (తెలుగుగళం) న్యూస్ :**

నేడు (శనివారం) జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ ఎం. నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.శనివారం ఉదయం 10.00 గంటలకు ఖమ్మం న్యాయ సేవా సదన్ నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ ను రాజీ పడదగిన కేసులను పరిష్కరించుకోవచ్చని జిల్లా న్యాయాధికారి సేవా సంస్థ చైర్మన్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై సమావేశం



**తెలుగు గళం ,హైదరాబాద్:** గుడిమల్కాపూర్‌లో శ్రీ వెంకటేశ్వర లేబర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమం, బాగోగులపై చర్చించారు. ఈ కార్యక్రమానికి స్థానిక టీఆర్ఎస్ సీనియర్ నేత శ్రీధర్ సాగర్ హాజరయ్యారు. నియోజకవర్గంలో భవన నిర్మాణ కార్మికులకు ఎలాంటి సమస్య ఎదురైనా వారి తరపున నిలబడి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు.

# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను పూజించాలి : పద్మారావు గౌడ్




**తెలుగు గళం ,సికింద్రాబాద్, సెప్టెంబరు 11 :** పర్యావరణ పరిరక్షణకు ప్రాముఖ్యతను కల్పించాల్సి ఉందని, ప్రకృతిని పరిరక్షిస్తేనే మానవాళి మనుగడ సాధ్యమని గుర్తించాలని సికింద్రాబాద్ శాసనసభ్యులు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావు గౌడ్ అన్నారు. జీహెచ్ఎంసీ ఆద్వర్యంలో సికింద్రాబాద్ లో చేపట్టిన మట్టి గణపతి విగ్రహాల పంపిణీ కార్యక్రమాన్ని పద్మారావు గౌడ్ శుక్రవారం సితాఫలమండీ లోని తన క్యాంపు కార్యాలయంలో లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవలి కాలంలో పర్యావరణ అనుకూల విధానాల పట్ల ప్రజల్లో సానుకూలత వ్యక్తం అవుతోందని అన్నారు. మట్టి వినాయకులను వినియోగించడం పర్యావరణానికి అవసరమని అన్నారు. బల్దియా అధికార యంత్రాంగం తాయారు చేయించి అందించడం ఆనందకరమని పద్మారావు గౌడ్ పేర్కొన్నారు. మాజీ కార్పొరేటర్ సామల హేమ, అధికారులు, నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.